క్లుప్తంగా

సోయా కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం నుంచి సోయా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాతావరణంలో మార్పుల కారణంగా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి కొనుగోళ్ల తేదీలను ప్రకటించిన తర్వాతే రైతులు సోయాలు తీసుకోనిరావాలని కోరారు.

నేడు బైక్ ర్యాలీ

ఇచ్చోడ: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి గుడిహత్నూర్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

క్రీడలకు సమయం కేటాయించాలి

బజార్‌హత్నూర్: యువత చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలని ఎస్సై అప్పారావ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన యువజన సంఘం మండల అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పోలీస్ టీం, భీంపూర్ మండల టీంల మధ్య జరిగిన పోటీలో టాస్ వేసి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో కాప్సే అక్షయ్‌కుమార్, జనార్దన్, ప్రభాకర్, సురేశ్, అజయ్, సుకుమార్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో అనిత

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడతాయని ఎంఈవో పవార్ అనిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టాలెంట్ పరీక్షలో జిల్లాస్థాయిలో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. రాథోడ్ సాయికిరణ్, అబుజార్‌ఖాన్, కోవా పరమేశ్వర్, మాడవి సురేశ్ ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు జ్వాలాముఖి, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, మారోతి, ఈశ్వర్ పాల్గొన్నారు.


'మహిళలపై హింస నేరం'



అవగాహన కల్పిస్తున్న సఖీ సిబ్బంది

గుడిహత్నూర్: మహిళలపై హింస నేరమని సఖీ సోషల్ కౌన్సెలర్ లావణ్య పిలుపు నిచ్చారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా సోమవారం మండలంలోని సీతాగోంది గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న హింసను క్షమించరాని నేరంగా పరిగణించాలని, లింగ వివక్షత, లింగ సమానత్వం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సఖీ కేంద్రంలో అందించే సేవలను వివరించారు. సమాజంలో మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే 181, 1098, 100 నంబర్లకు ఫోనుద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది, ఆశ వర్కర్లు, సఖీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈవో

నేరడిగొండ: జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని కుమారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా విభాగంలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపిక అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంది.. దిగుబడిపై రంది

- వాతావరణంలో అనూహ్య మార్పులు
- పంట దిగుబడిపై ప్రభావం
- పెరుగుతున్న పురుగు ఉధృతి
- ఆందోళనలో రైతులు



పొన్నారి శివారులో సాగు చేస్తున్న కంది

తాంసి: వాతావరణంలో ఒకసారిగా వస్తున్న మార్పులు పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గత పది రోజులుగా ఆకాశం మేఘావృత్తమై ఉండడం, అకాల వర్షాలు కురవడంతో పురుగు ఉధృతి పెరుగుతుంది. దీంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది అధికంగా పత్తి, సోయా పంటలో అంతర పంటగా రైతులు కంది ఎక్కువగా సాగు చేశారు. వర్షాకాలం సీజన్‌లో సాగు చేసిన కంది పూత, కాత వరకు అనుకూలంగా ఉండటంతో రైతులు ఆశలు పెట్టుకున్నారు. చలి తీవ్రత తగ్గి వాతావరణంలో మార్పులతో పూత, కాతపై ప్రభావం చూపుతుంది. పూత సైతం నేలరాలుతోంది. పురుగు ఉధృతి నుంచి పంటలను రక్షించుకునేందుకు అధికంగా మందులు పిచికారీ చేస్తున్నారు.

పెరిగిన సాగు..

ఈఏడాది తాంసి భీంపూర్ మండలాల్లో అంచనాలకు మించి రైతులు కంది పంట సాగు చేశారు. ఉమ్మడి మండలంలో దాదాపుగా 4 వేల ఎకరాల్లో రైతులు కంది వేశారు. మొదట్లో వర్షాలు అనుకూలంగా ఉండడంతో రైతులు సంతోషపడ్డారు. కానీ ఇప్పుడు పంట పూత, కాత దశలో ఉన్నప్పుడు అనుకూల వాతావరణం లేక పూత, కాతపై ప్రభావం చూపుతుంది. పోగమంచు కారణంగా పూత రాలుతోంది. మండలంలోని తాంసి, గోముత్రి, అందర్‌బంద్, జామిడి, పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్ల, పాలోది, గిరిగాం గ్రామాల్లో భారీగా పంట దెబ్బతింటుంది.

పురుగు ఉధృతి..

పంటలకు సోకిన చీడపీడల నివారణ నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తమవుతున్నారు. అధికంగా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. పంటను లద్దెపురుగు, ఆకుపచ్చ పురుగు, రసం పీల్చు పురుగు, ఆకుముడత పురుగులు దెబ్బతిస్తున్నాయి. కంది సాగుకు రైతులు ఇప్పటి వరకు ఎకరాకు రూ.5 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంటలపై చీడపీడల ఉధృతి అధికంగా ఉండడంతో పంటను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పురుగు ఉధృతి తగ్గడం లేదు



పురుగు ఉధృతి ఎన్ని మందులను పిచికారీ చేసిన తగడం లేదు. కంది పంటనేమో ప్రస్తుతం పూత దశలో ఉంది. చలితీవ్రత ఒకసారి తగ్గడంతో పంటలో పురుగు ఉధృతి పెరిగింది. దీనికి తోడు గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి సైతం పూత నేలరాలింది.

– మలపతి శంకర్, యువరైతు, పొన్నారి

అధిక మోతాదు పిచికారీ చేయొద్దు



చలితీవ్రత ఒకసారిగా తగ్గడంతో పాటు పోగమంచు ఉండడంతో కందిలో పురుగు ఉధృతి పెరిగింది. పురుగు ఉధృతి నివారించేందుకు రైతులు ఎక్కువ మోతాదులో మందులను పిచికారీ చేయవద్దు. ఏఈవోలను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– రవీందర్, మండల వ్యవసాయాధికారి

సమస్యల పరిష్కారానికి పెద్దపీట



భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

గుడిహత్నూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించి అంబేడ్కర్, కుమురం భీం, అన్నాభావు సాఠే విగ్రహాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం జై భీంనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని స్థానిక బుద్ధవిహార్ ఎదుట రూ.5 లక్షలతో నిర్మించనున్న రేకుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, మాజీ జెడ్పీటీసీ మాధవ్ మస్కే, కరాడ్ బ్రహ్మానంద్, సోంటక్కే బాలాజీ, తొడసం గోవింద్‌రావ్, ససానే మాధవ్, బుద్దే గోవింద్, తొడసం దౌలత్‌రావ్, జలంధర్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం మైనింగ్ ఏడీకి వినతిపత్రం అందజేశారు. పెన్‌గంగా నది నుంచి జేసీబీలతో రోజుకు వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. పలుసార్లు వారికి తెలిపినా పట్టించుకోకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరుపుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భోజన్న, గ్రామస్తులు సుదర్శన్, రమణారెడ్డి, శ్రీనివాస్, సురేందర్, దశరథ్, మల్లేశ్, అశోక్, స్వామి, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

'పీఎం జన్‌మన్ నిధులు పక్కదారి'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కొలాం తెగ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎం జన్‌మన్ నిధులను ఐటీడీఏ అధికారులు పక్కదారి పట్టించారని కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్, వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావ్‌లు ఆరోపించారు. ఈనెల 16న చేపట్టనున్న ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్నెవార్‌లు ఆదివాసీ ప్రాంతాల్లో కొలవార్‌గా చలమణి అవుతూ కొలాం తెగ హక్కులను కొల్లగొడుతున్నారని విమర్శించారు. 2021లో అప్పటి గిరిజన శాఖ కమిషనర్ మన్నెవార్‌లను పీవీటీజీలుగా గుర్తింపునివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమ్ర రాజు, టేకం లక్ష్మణ్, టేకం గణేష్, మడావి జంగు, టేకం ముత్త, మడావి బాలు, జలపతి రావ్, కొడప నాగేశ్వర్ పాల్గొన్నారు.

ఆదర్శ మహిళా పోటీ పరీక్షలు ప్రారంభం



ప్రశ్నపత్రం అందజేస్తున్న ప్రిన్స్‌పాల్

ఆదిలాబాద్‌రూరల్: శ్రీ రామకృష్ణ సంఘ జనని శ్రీశారదా మాత 172వ జయంతి వేడుకలను పురస్కరించుకుని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే బాలికల కళాశాల విద్యార్థినులకు శ్రీ శారదా దేవి జీవితం సందేశం పుస్తకంపై పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ కీర్తి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో మహిళలకి శారదా దేవి జీవితం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కష్టాలు వచ్చినప్పుడు కుంగి పోకుండా ధైర్యంగా ఉండాలన్నారు. ఈ పుస్తకం ద్వారా విద్యార్థినులలో మార్పు కలుగుతుందన్నారు. సేవా సమితి ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సభ్యులు హన్మాండ్లు, ఉపాధ్యాయులు శైలజ, సౌమ్య, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఐసీడీఎస్ పీడీ సబితాకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 12 చలో హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆసంఘం నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, జిల్లా కార్యదర్శి సునీత, సుజాత, కల్యాణి, పార్వతి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని లిటిల్‌స్టార్ పాఠశాలలో సోమవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనలను పెపొందించుకోవాలని సూచించారు. నిత్యజీవితంలో సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయం వైపు పయనించాలన్నారు. విద్యార్థులు ట్రాఫిక్, పచ్చదనం, పరిశుభ్రత, నీటి శుద్ధి, సేంద్రియ ఎరువుల తయారీ, చెత్త నుంచి విద్యుత్ తయారీ, వర్షపు నీటి సంరక్షణ, తదితర అంశాలపై ప్రదర్శనలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, ఆరె భాస్కర్, రాజేశ్వర్, ప్రిన్స్‌పాల్ కమలాకర్, వైస్ ప్రిన్స్‌పాల్ స్వరూప, రమేశ్, ప్రత్యూష, అరుణ, జగదీష్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతాం'



మాట్లాడుతున్న కనక ప్రభాకర్

నార్నూర్: ఆదివాసీ హక్కులు, అస్తిత్వం కోసం పోరాడుతామని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆదివాసీ పోరుగర్జన సభకు తరలి వెళ్లె క్రమంలో మండలంలోని గుండాల గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టబద్ధలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి, గత తెలంగాణ ప్రభుత్వం కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం విద్యా, వైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. జైనూర్ ఘటనతో పాటు రాష్ట్రంలో ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ రైతు భరోసా అమలు చేయాలన్నారు. సమావేశంలో తుడందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు అడ శ్రీరామ్, ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర ప్రతిభ పరీక్ష పోటీలు



పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మండల స్థాయి జీవశాస్త్ర ప్రతిభ పరీక్ష పోటీలు నిర్వహించారు. మండలంలోని పొన్నారి, కప్పర్ల, తాంసి పాఠశాల విద్యార్థులు పరీక్ష రాశారు. ఎంఈవో శ్రీకాంత్, మండల కన్వీనర్ సంతోశ్ పరీక్షను పరిశీలించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బిందుజ,అనుశ్రీ, సృజన్, తేజశ్రీ, అనుష్క అభినందించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లాస్థాయి పరీక్షల్లో విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఈవో శ్రీకాంత్ తెలిపారు. ఉపాధ్యాయులు కరుణ, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వీ నాయకుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అభిప్రాయాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బుట్టి శివకుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది ఆరాధించే తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం మార్చేయడం అమానుషమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనను తెలంగాణ తల్లి సైతం ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులకు పాల్పడడం ప్రజాగళాన్ని గొంతు నొక్కడమేనని మండిపడ్డారు.

ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీని అసెంబ్లీలో ప్రస్తావించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆదిలాబాద్: ఎంపీహెచ్ఏ (మేల్) పోస్టుల భర్తీ గుర్తించి అసెంబ్లీలో ప్రస్తావించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఎంపీహెచ్ఏ అసోసియేషన్ సభ్యులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీహెచ్ఏ నోటిఫికేషన్ లేక ఎంతో మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, దీంతో ఇబ్బంది పడాల్సివస్తుందన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, ఎంపీహెచ్ఏ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు ప్రసాద్ కుమార్, ప్రేమ్ దాస్, సోను సింగ్ ఉన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. సోనియా గాంధీ జన్మదినం సమగ్ర ఉద్యోగులకు శిక్ష దినం అన్నారు. సమగ్ర ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్థసారథి, ప్రకాశ్, వెంకట్ రెడ్డి, మమత, కల్యాణి, మంజుల పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం కల్పన

ఇచ్చోడ: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ డీఎం కల్పన అన్నారు. సోమవారం సాయంత్రం బస్టాండ్‌ను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో త్వలరో బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు బస్టాండ్‌ను వినియోగించుకోవాలని కోరారు. ప్రైవేట్ వాహనాలు, ఆటోలు బస్టాండ్‌లో నిలపవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ విష్ణు, వందన, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలపై విచారణ జరిపించాలి'

కైలాస్‌నగర్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా అనైతికంగా పదవిలో కొనసాగుతున్న కొండూరి గంగాధర్ అక్రమాలపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు కోరారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామాల దేవిని కలిసి ఫిర్యాదు చేశారు. ఉద్యోగుల సంఘ భవన సముదాయంలోని ఏడు మడిగెలను తన స్వలాభం కోసం 20 సంవత్సరాల లీజు, అద్దెకు ఇవ్వడానికి లక్షలాది రూపాయలు అడ్వాన్స్‌గా దండుకునేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. కార్యవర్గ కాల పరిమితి ముగిసినా.. ఎన్నికలు నిర్వహించకుండా పదవిలో కొనసాగుతున్నారని ఆరోపించారు. మడిగెల ద్వారా ప్రతీ నెల అద్దెల ద్వారా రూ.60 వేల నుంచి రూ.80 వేలను వసూలు చేసుకుంటూ తన సొంతనికి వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జీ.ఆశన్న, నర్సింగ్, నరేందర్, పూలబాయి, అనిత, దారుబాయి, రాధ, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న ఆడె గజేందర్

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియాగాంధీ కృషి మరువలేనిదని కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, బోథ్ మండలంలోని సొనాల గ్రామంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ కేక్ కట్ చేశారు.

సన్మానం

బోథ్: బోథ్ మండల పాత్రికేయ సంఘం నూతన కార్యవర్గాన్ని తహసీల్దార్ సుభాష్ చందర్, మాల సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సూది నరేశ్, ప్రధాన కార్యదర్శి గొడిసెల రమణ గౌడ్, మాజీ అధ్యక్షుడు బోనగిరి కార్తీక్‌ను ఘనంగా సత్కరించారు.

బోథ్ ఎంపీవోగా అతుల్ కుమార్

బోథ్: బోథ్ ఎంపీవోగా అతుల్ కుమార్ బదిలీపై మండలానికి వచ్చారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ధర్మా జీవన్‌రెడ్డి ఇంద్రవెల్లి మండలానికి బదిలీ అయ్యారు. భీంపూర్ మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న అతుల్ కుమార్ బోథ్‌కు బదిలీపై వచ్చారు.

పరామర్శ

తాంసి: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని సోమవారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. భీంపూర్ మండలంలోని కరంజి గ్రామంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మామ ఏనుగు లింగారెడ్డి మృతి చెందారు. కాగా కరంజి గ్రామానికి వెళ్లి పరామర్శించారు.

12న సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికల ముసాయిదా పోలింగ్ కేంద్రాల గురించి ఈనెల 12న మధ్యాహ్నం 1 గంటలకు మండలంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశంలో ఏవైనా అభ్యంతరలు ఉంటే తెలియజేయాలన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో అన్నదానం చేపట్టారు. ట్రస్ట్ చైర్మన్ అనిల్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రయాణికులు, యాచకులకు భోజనం వడ్డించారు. సునీల్ కుమార్, రవి, శంకర్, మల్లికార్జున్, శివమణి, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.